సాక్షి
కర్నూలు
గురువారం ı 21 ı మార్చి ı 2024



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి, జ్వాలావీరభద్రస్వామికి వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా బుధవారం శ్రీశైల దేవస్థాన నిత్యకళావేదికపై బళ్లారికి చెందిన ప్రగతి నృత్యకళా ట్రస్ట్ కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



తిరువీధుల్లో దేవదేవుడు

అహోబిలేశుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దిగువ అహోబిలంలో శేషవాహనంపై, ఎగువ అహోబిలంలో శరభప్రభవాహనంపై స్వామి వారు విహరించారు. 8లో▸

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 4:57
ఆదోని	సా॥ 6:35	ఉ॥ 5:00
నంద్యాల	సా॥ 6:32	ఉ॥ 4:54
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:55
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:55

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

అల్లాహ్‌కి ఇష్టమైన పుణ్య కార్యాల్లో జకాత్ ఒకటి. మీ ధన, సంపద మొత్తంలో 2.50 శాతం జకాత్ పేరుతో దానధర్మాలు చేయండి.
– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

మూడో రోజు 589 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మూడో రోజైన బుధవారం 589 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 162 కేంద్రాల్లో 31,465 మంది విద్యార్థులకుగాను 30,876 మంది పరీక్ష రాశారు. 'పది' పరీక్షల పరిశీలకులు కె.గీత ఐదు కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి కాగిత శామ్యూల్, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఈఓ పేర్కొన్నారు.

రేపు ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ రాక

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్ ఈ నెల 22వ తేదీన కర్నూలుకు రానున్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం కర్నూలులో నిర్వహించే ప్రత్యేక సమీక్ష సమావేశంలో పాల్గొంటారని విద్యుత్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. వేసవిలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడంపై ప్రధానంగా చర్చిస్తారు. ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్‌ల సామర్థ్యం పెంపు తదితర వాటిపై ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ దిశానిర్దేశం చేస్తారని అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సమస్యలు రానీయొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నందున పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన విద్యుత్ భవన్‌లోని తన కార్యాలయంలో టెలీకాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విద్యుత్ అధికారులు తమ పరిధిలో అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు విధిగా పరిశీలించి ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. విద్యుత్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది విధిగా పనిచేసే ప్రాంతం(హెడ్ క్వాటర్)లోనే నివాసం ఉండాలని ఆదేశించారు. మార్చి నెల విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో విద్యుత్‌కు డిమాండ్ ఏర్పడుతుందని, ఇందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈలు ఓబులేసు, విజయబాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఇంట మద్దతు ధైర్యం

నాడు..

2014 నుంచి 2019 వరకు ప్రతి ఏటా కరువే. అంతంతమాత్రం పండించిన పంటలకు కూడా ధరలు లేక రైతులు ఏటా నష్టాలు మూటకట్టుకున్నారు. అప్పటి ప్రభుత్వం తూతూమంత్రంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి హడావుడి చేసింది. రైతుల నుంచి కాకుండా టీడీపీ కార్యకర్తల నుంచి మాత్రమే మద్దతు ధరలతో కొనుగోలు చేసిన సందర్భాలు ఉన్నాయి. టీడీపీ హయాంలో ధరలు తక్కువగానే ఉన్నప్పటికీ రైతుల నుంచి 89 వేల టన్నులు మాత్రమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేశారు. అవి కూడా వేరుశనగ, కందులు, శనగలు, పత్తి, మొక్కజొన్న పంటలను మాత్రమే!

నేడు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత రైతులకు రికార్డు స్థాయిలో మద్దతు ధర లభించింది. ధరలు లేనప్పుడు వెంటనే ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పారదర్శకంగా కొనుగోళ్లు జరిగాయి. వేరుశనగ, కందులు, శనగలు, పత్తి, మొక్కజొన్న తోపాటు పసుపు, జొన్నలు, కొర్రలు, మినుములు, సజ్జలు..ఇలా అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేశారు. చిరుధాన్యాలు, ఎండుమిర్చి, ఉల్లి తదితర పంటలకు కూడా మద్దతు ధరలు ప్రకటించి రైతుల్లో భరోసా నింపారు. ఐదేళ్ల పాలనా కాలంలో రైతుల నుంచి 5,29,210 టన్నుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేశారు.

- ధరల స్థిరీకరణ నిధితో అన్ని పంటలకు లభించిన మద్దతు ధర
- ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 5,29,210 టన్నుల కొనుగోలు
- టీడీపీ హయాంలో దళారులు ఇచ్చిందే ధర
- చంద్రబాబు హయాంలో 89 వేల టన్నులు మాత్రమే కొనుగోలు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. కర్షకుల రెక్కల కష్టాన్ని వృథా కానీయకుండా అన్ని పంటలకు మద్దతు ధర కల్పించింది. రాష్ట్రంలో 2019 నుంచే అన్నదాతలకు మద్దతు ధర ఇచ్చేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసింది. సీఎం యాప్‌ను రూపొందించి ప్రతి రోజూ రైతులు పండించిన వివిధ పంటలకు ధరలు ఏ విధంగా ఉన్నాయనే దానిని పర్యవేక్షిస్తోంది. ధరలు పడిపోయినప్పుడు రాజకీయాలకు అతీతంగా రైతులకు మద్దతు ధర కల్పిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు 5,29,210 టన్నుల పంట ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేశారు. కర్నూలు జిల్లాలో 2,93,442, నంద్యాల జిల్లాలో 2,35,768 మెట్రిక్ టన్నుల ప్రకారం పంటలను కొనుగోలు చేశారు. వేరుశనగ, మొక్కజొన్న, కందులు, శనగలు, మినుములు, పెసలు, పసుపు, జొన్న, కొర్ర, సజ్జ పంటలను మార్క్‌ఫెడ్, వరి ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ, పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) మద్దతు ధరతో కొనుగోలు చేసింది. కరోనా వైరస్ కోరలు చాచిన రెండేళ్లు రైతులను ప్రభుత్వం మద్దతు ధరలతో ఆదుకుంది.



మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు శనగలను శుభ్రం చేస్తున్న దృశ్యం (ఫైల్)

గ్రామస్థాయిలోనే కొనుగోలు కేంద్రాలు

పంట దిగుబడులు మార్కెట్‌లోకి రాకముందే రైతులు దళారుల బారిన పడకుండా ఉండేందుకు గ్రామస్థాయిలోనే రైతుభరోసా కేంద్రాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉండటంతో మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నాయి. ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు లేకపోతే దళారులు మద్దతు కంటే 25 నుంచి 35 శాతం తక్కువ ధరలతో పంటలను కొనుగోలు చేసేవారు. కొనుగోలు కేంద్రాలు ఉండటంతో దళారులు కూడా మద్దతు కంటే ఎక్కువ ధరను పంటలను కొనుగోలు చేస్తున్నారు.

ఐదేళ్లలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మద్దతు ధరతో కొనుగోలు చేసిన పంటల వివరాలు (టన్నుల్లో)

పంట	కర్నూలు జిల్లా	నంద్యాల జిల్లా
మొక్కజొన్న	1,87,872	1,54,675
శనగలు	25,185	25,654
జొన్న	35,439	41,718
పసుపు	7,444	2,204
సజ్జ	1,881	1,892
వేరుశనగ	571	42
కొర్ర	115	11
ఉల్లి	929	--
పత్తి	31,374	--
వరి	2,632	9,572
మొత్తం	2,93,442	2,35,768

ధరలు ఆశాజనకమే...

వైఎస్‌ఆర్‌సీపీ పాలనలో వివిధ పంటలకు ధరలు మెరుగ్గా లభించాయి. గతంలో ఎపుడూ లేని విధంగా పత్తి రైతుకు గిట్టుబాటు ధరలు లభించాయి. 2020–21 నుంచి పత్తి ధరలు మెరుగ్గానే ఉంటున్నాయి. రికార్డు స్థాయిలో పత్తి క్వింటా ధర రూ.13వేలకు పైగా పలికింది. దిగుబడులు భారీగా ఉన్నప్పటికీ ధర పెరగడం విశేషం. వేరుశనగకు ప్రతి ఏటా ధరలు మెరుగ్గానే ఉంటున్నాయి. ఈ ఏడాది కందులు, శనగలు, మినుములు, కొర్రలు, వేరుశనగ ధరలు మరింత జోరుమీద ఉండటం రైతులకు కలసి వస్తోంది.

మద్దతు ధరతో నష్టాల నుంచి గట్టెక్కాం



మాకున్న పొలంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాం. మార్కెట్‌లో ధరలు పడిపోయిన ప్రతి ఏటా మద్దతు ధరతో అమ్ముకునే అవకాశాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది. ఈ ఏడాది మొక్కజొన్నకు మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. 2022–23లో ధరలు లేవు. ఆ ఏడాది 120 క్వింటాళ్ల మొక్కజొన్నలు క్వింటా రూ.1,960 ప్రకారం మద్దతు ధరతో మార్క్‌ఫెడ్‌కు విక్రయించాం. ఐదేళ్లలో ఎక్కువసార్లు మద్దతు ధరతో పంటలను అమ్ముకొని నష్టాల నుంచి గట్టెక్కాం.
– ఎన్.జయప్రతాప్‌రెడ్డి, నల్లవాగుపల్లె, రుద్రవరం మండలం, నంద్యాల జిల్లా

చాలా మంచి జరిగింది



మేం ప్రధానంగా శనగ, కంది సాగు చేస్తున్నాం. మార్కెట్‌లో ధరలు పడిపోయాయంటే రైతుల ముంగిట్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషాన్ని ఇచ్చింది. 2022–23లో శనగల ధర పూర్తిగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.5,335 ప్రకారం మద్దతు ధరతో కొనుగోలు చేయించింది. ధరలు పడిపోయిన సమయంలో ప్రభుత్వం ఆదుకోవడం రైతులకు ఊరటనిచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాకు చాలా మంచి జరిగింది.
– కె. రామచంద్ర, పెద్దపాడు, కల్లూరు మండలం

రైతుల్లో ఆనందం

టీడీపీ హయాంలో పంటలను అమ్ముకోవాలంటే తల ప్రాణం తోకకు వచ్చేది. మండల కేంద్రానికి సరుకును తీసుకెళ్తే.. కొనుగోలు చేయడానికి రెండు, మూడు రోజుల సమయం పట్టేది. అధికారులు సహకరించే వారు కాదు. అప్పటి ప్రభుత్వం కూడా చూసీచూడనట్లు వ్యవహరించేంది. అప్పటి పాలకులు అక్రమాలను ప్రోత్సహించారనే విమర్శలు వచ్చాయి. కష్టాలు పడలేక చాలా మంది రైతులు నష్టానికే పంటను దళారులకు అమ్ముకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో సమూల మార్పులు తీసుకొచ్చింది. పంటలన్నింటికీ మద్దతు ధర కల్పించింది. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పంటల కొనుగోలు సాగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు



సమావేశంలో మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమేనని, కేవలం తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు మాత్రమే పోరాటం చేస్తున్నారే తప్ప ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని ఏపీ ఎన్‌జీఓస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి అన్నారు. పెండింగ్ డీఏలు, మహిళా ఉద్యోగులకు శిశు సంరక్షణ సెలవులు, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినందుకు ప్రభుత్వానికి ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన దస్తగిరిరెడ్డి సన్మాన కార్యక్రమానికి వెంగళరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నంద్యాల తాలూకా అధ్యక్షులు మణిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంగళరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మీద ఉద్యోగులకు ఎలాంటి వ్యతిరేకత లేదని, కేవలం సమస్యల సాధనకు మాత్రమే పోరాటం చేస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ ముందుంటుందన్నారు. అనంతరం వెంగళరెడ్డిని అసోసియేషన్ నాయకులు సన్మానించారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

కర్నూలు (టౌన్): ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కాగా.. కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పి.రుద్రవరం, గార్గేయపురం ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు తాలూకా సీఐ శ్రీధర్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గార్గేయపురంలో సాయుధ బలగాల కవాతు

సీఎం బస్సు యాత్రను విజయవంతం చేద్దాం



మేమంతా సిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు

- 'మేమంతా సిద్ధం' సమన్వయ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి, పార్టీ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి
- హాజరైన పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు

కర్నూలు (టౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేద్దామని మంత్రి, పార్టీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. 'మేమంతా సిద్ధం' పేరుతో ఈనెల 27 నుంచి సీఎం వైఎస్ జగన్ చేపడుతున్న బస్సు యాత్రకు సంబంధించి బుధవారం కర్నూలు కొత్తబస్టాండ్ సమీపంలోని ఒక హోటల్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల నాలుగు ప్రాంతాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభలు విజయవంతం అయ్యాయన్నారు. అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రి బస్సు యాత్ర ప్రారంభిస్తున్నారన్నారు. ఈనెల 27న ప్రారంభమయ్యే ఈబస్సు యాత్ర 28న ఆళ్లగడ్డ, నంద్యాలలో, 29న ఎమ్మిగనూరులో ఉంటుందని, ఆయా ప్రాంతాల్లో ముఖ్యమంత్రి సభలు, సమావేశాల్లో పాల్గొంటారని చెప్పారు. అలాగే ప్రజలతో మాట్లాడతారని పేర్కొన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించడమే కాకుండా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. బస్సు యాత్రను పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ ప్రజాప్రతినిధులు, పరిశీలకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా విజయవంతం చేయాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

అనైతిక పొత్తు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏనాడు ఒంటరిగా పోటీ చేయలేదని మంత్రి పెద్దిరెడ్డి గుర్తు చేశారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబు.. జగన్‌ను చూసి భయపడి అనైతిక పొత్తు పెట్టుకున్నారన్నారు. ఈ పొత్తును ప్రజలు నమ్మబోరన్నారు. ఒక్క శాతం ఓట్లు లేని వారితో, ఒక్క సీటు కూడా గెలవలేని వారితో పొత్తు పెట్టుకోవడం టీడీపీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. గతంలో మోదీని తీవ్రంగా విమర్శించి ఇప్పుడు పొత్తు పెట్టుకున్నారని, అందితే జుట్టు అందకుంటే కాళ్లు పట్టుకోవడం చంద్రబాబుకే చెల్లుబాటు అవుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీదే మళ్లీ విజయం


ఉమ్మడి జిల్లాలో మరోసారి 2019 సంవత్సరం ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయని మంత్రి అన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందన్నారు. ఇప్పటికే కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించామన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. ఇప్పటికే మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ ఏర్పాటయ్యాయన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. జగన్నాథగట్టు వద్ద రూ.1000 కోట్లతో న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేశారన్నారు. కర్నూలును న్యాయరాజధానిగా కొనసాగిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారందరికీ ఈ ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచిందన్నారు. ఎన్నికలకు మరింత సమయం ఉందని, అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, కంగాటి శ్రీదేవి, గంగుల బిజేంద్రా రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, హాఫీజ్‌ఖాన్, సుధాకర్, జలవనరుల శాఖ సలహాదారుల గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు బుట్టా రేణుక, ఇంతియాజ్, బూసినే విరుపాక్షి, డాక్టర్ దారా సుధీర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శశికళారెడ్డి, డీసీసీబీ చైర్మన్ విజయమనోహరి, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ఆళ్లగడ్డ/నంద్యాల (అర్బన్): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టనున్న బస్సు యాత్ర ఈ నెల 27న ఇడుపులపాయ నుంచి ప్రారంభమై అదే రోజు రాత్రి ఆళ్లగడ్డకు చేరుకోనుంది. ఈ సందర్భంగా ఆళ్లగడ్డలో సీఎం బస చేసే ప్రదేశాన్ని నంద్యాల జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశీలించారు. మంత్రి వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి ఉన్నారు.

నంద్యాలలో..

బస్సు యాత్ర 28న నంద్యాలకు చేరుకోనుంది. పట్టణంలో బహిరంగ సభకు అవసరమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్పీజీ మైదానాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల కో ఆర్డినేటర్, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, శిల్పాచక్రపాణిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పరిశీలించారు.



నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

'సింగిల్ విండో'తో ప్రచార అనుమతులు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు కల్చరల్: సింగిల్ విండో పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వెంటనే ఎన్నికల ప్రచారానికి అనుమతి ఇస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు నిర్వహించుకునే సమావేశాలు, వివిధ మాధ్యమాల ద్వారా చేసుకునే ప్రచారాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ప్రధాన రహదారులు, హైవే రోడ్ల పక్కన ఉన్న హోర్డింగులను సమాన ప్రాతిపదికన అందరికీ కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న హోర్డింగులు తప్ప కొత్తవి ఏర్పాటు చేయబోమని స్పష్టం చేశారు. ఆర్‌వో కార్యాలయాల్లో కూడా సింగిల్ విండో పోర్టల్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఎంసీసీ అమల్లోకి వచ్చిందన్నారు. ఎంసీసీ అమలును జిల్లా పరిషత్ సీఈఓ, హౌసింగ్ పీడీ పర్యవేక్షిస్తున్నారని, ఇందుకు సంబంధించి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఒక కమాండ్, కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్ భవనాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ఎస్పీ కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలో 8 నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్ బ్లాక్‌లో పాణ్యం, కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాలు, లైఫ్‌సైన్స్ బ్లాక్‌లో కర్నూలు, ఆదోని నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లు కౌంటింగ్ హాల్స్, లైబ్రరీ బ్లాక్‌లో మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సంబంబంధించి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ, టిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డీటీసీ శ్రీధర్, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, టౌన్ డీఎస్పీ విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్, జేసీ మౌర్య తదితరులు

గడువులోగా ఎన్నికల ఫిర్యాదుల పరిష్కారం

ఎన్నికలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి ఎన్నికల అంశాలపై ఆర్వోలు, మున్సిపల్ కమిషనర్‌లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సి విజిల్ పోర్టల్‌లో వచ్చిన ఫిర్యాదులను 75 శాతం మాత్రమే పరిష్కరించారని, 100 శాతం చేరే విధంగా చూసుకోవాలన్నారు. అదే విధంగా 24 గంటలు, 48 గంటలు, 72 గంటలకు సంబంధించి ఫిర్యాదుల నివేదికలను ఎప్పటికప్పుడు పంపించాలని జిల్లా పరిషత్ సీఈఓను ఆదేశించారు. ఓటరు జాబితాకు సంబంధించి 8,400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.

క్లుప్తంగా

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి 30 రోజుల శిక్షణకు 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు మహిళలు అర్హులన్నారు. చదవడం, రాయడం వచ్చి ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పెద్దాసుపత్రికి అనెస్తీషియా వర్క్‌స్టేషన్ పరికరాలు విరాళం



విరాళం అందజేస్తున్న పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మూడు అనెస్తీషియా వర్క్‌స్టేషన్ పరికరాలను విరాళంగా అందజేశారు. బుధవారం వాటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్.కే. చౌవన్, విక్రమ్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ రూ.18.75లక్షల విలువైన ఈ పరికరాలను విరాళంగా ఇచ్చారన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగకరమన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు బుధవారం నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 18 పరీక్ష కేంద్రాల్లో 2, 246మంది విద్యార్థులకు గాను 1,877మంది హాజరయ్యారు. ఇందులో 10వ తరగతి పరీక్ష 1046 మంది, ఇంటర్ పరీక్ష 1055 మంది రాసినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ తెలిపారు. రాష్ట్ర పరిశీలకులు గంగా భవానీ ఓపెన్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

మహిళ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రమణమ్మ

పగిడ్యాల: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. నంకిరేణిపల్లెలో బుధవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన చాకలి వెంకటస్వామి భార్య చాకలి రమణమ్మ(52) కుల వృత్తితో పాటు వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగించేవారు. ఈమెకు ముగ్గురు కుమారులు కాగా వారికి పెళ్లిళ్లు అయ్యాయి. ముగ్గురు కుమారులు వేర్వేరుగా ఉంటున్నారు. మృతురాలి భర్త వెంకటస్వామి రెండో కుమారుడు శేఖర్ వద్ద ఉంటుండగా రమణమ్మ చిన్న కుమారుడు వెంకటేశ్వర్లు వద్ద ఉంటోంది. అయితే చిన్న కొడుకు, కోడలు తరచు గొడవలు పడుతుంటారు. మంగళవారం రాత్రి కూడా వారిద్దరు ఘర్షణ పడటంతో తీవ్ర మనస్థాపానికి గురైన తల్లి రమణమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. గమనించిన కొడుకు వెంటనే మెరుగైన వైద్యం కోసం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక బుధవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జయశేఖర్ తెలిపారు.

తిరువీధుల మెరసీ దేవదేవుడు



శేషవాహనంపై ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదుడు



శరభ వాహనముపై కొలువై ఊరేగుతున్న జ్వాలా నరసింహస్వామి

- వైభవంగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు
- శేషవాహనంపై దర్శనమిచ్చిన శ్రీ ప్రహ్లాదవరదుడు
- శరభ ప్రభవాహనంపై విహరించిన జ్వాలా నరసింహుడు

ఆళ్లగడ్డ: ప్రహ్లాదవరదుడు చిన్ని కృష్ణుడయ్యాడు. ఆదిశేషుడిని వాహనంగా చేసుకుని నవనీత కృష్ణావతారంలో మాడ వీధుల్లో ఉభయ దేవేరులతో తొమ్మిది తలల శేష వాహనం అధిష్టించి ఊరేగారు. నెమలి పింఛం, ఫ్లిలనగ్రోవి, నవనీతంతో ఉన్న కృష్ణుడి రూపం భక్తులను కనువిందు చేసింది. అహోబిలంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం ఉదయం శ్రీ ప్రహ్లాదవరద స్వామి ఉభయ దేవేరులతో శేషవాహనము అధిరోహించి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తాదుల సేవలు అందుకున్నారు. అంతకు ముందు వేకువజామున నిత్య పూజల్లో భాగంగా సుప్రత సేవతో మూలవిరాట్ శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను మేలుకొలిపి దివ్య దర్శనం కల్పించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాద వరదుడిని యాగశాలలో పట్టు వస్త్రాలతో అలంకరించి కొలువుంచారు. తర్వాత వివిధ రకాల స్వర్ణాభరణాలు ధరించిన ప్రహ్లాదవరదుడు తొమ్మిది తలల శేషవాహనం అధిష్టించి మాడ వీధుల్లో సంచరించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి తిరుమంజనం నిర్వహించి అద్దాల మండపంలో కొలువుంచారు. రాత్రి శ్రీ ప్రహ్లాదవరద స్వామి చంద్రప్రభ వాహనముపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు.



బ్రహ్మోత్సవాలకు హాజరైన రష్యా దేశ పౌరులు

శరభ వాహనం అధిరోహించిన జ్వాలా నారసింహ స్వామి

అహోబిలంలో కొలువైన శ్రీ జ్వాలా నరసింహ స్వామి బుధవారం శరభ వాహనం అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం నిత్య పూజల అనంతరం ఉత్సవ మూర్తులైన జ్వాలనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. తర్వాత యాగశాలలో కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి శ్రీ జ్వాలనరసింహస్వామిని శరభ వాహనంపై కొలువుంచి మాడవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

అహోబిలం బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎగువ అహోబిలంలో ఉదయం ఉత్సవం, మధ్యాహ్నం అభిషేకం, రాత్రి పొన్నుచెట్టువాహనం సేవ, దిగువ అహోబిలంలో ఉదయం మోహి ని అలంకారం, మధ్యాహ్నం అభిషేకం, రాత్రి శరభ వాహనం సేవలు ఉంటాయి

పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోండి



ఉచిత స్టడీ మెటీరియల్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

నంద్యాల (న్యూటౌన్): పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు (పాలీసెట్) ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నంద్యాల ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి ఈ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తుందన్నారు. పదవ తరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు.

ఓసీ, బీసీ అభ్యర్థులు 400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100 ఫీజు చెల్లించి https://poycetap.nic.in/ Default.aspx ద్వారా వచ్చే నెల 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తుదారులకు ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వివరాలకు సెల్ : 9912377723, 9440021417 నంబర్లను సంప్రదించాలన్నారు.

పీటల మీద ఆగిన పెళ్లి

తాళికట్టే సమయంలో వరుడి బాగోతం బట్టబయలు

- తనతో సహజీవనం చేస్తున్నాడంటూ ఫొటోలు పంపిన విశాఖపట్టణం యువతి
- పెళ్లి రద్దు చేసుకున్న వధువు కుటుంబ సభ్యులు

వెల్దుర్తి(కృష్ణగిరి): పెళ్లి కుమారుడు తనతో సహజీవనం చేస్తున్నాడంటూ ఓ యువతి అందుకు సంబంధించిన ఫొటోలు పంపడంతో మరో అరగంటలో జరగాల్సిన పెళ్లి నిలిచిపోయిన ఘటన బ్రహ్మగుండం క్షేత్రంలో బుధవారం చోటు చేసుకుంది. వెల్దుర్తి మండల పరిధిలోని రామళ్లకోటకు చెందిన యువకునికి కర్నూలు మండలానికి చెందిన యువతితో పెళ్లి కుదిరింది. రూ.లక్షల్లో కట్నకానుకలు పూర్తి కాగా రామళ్లకోట టు వెల్దుర్తి రోడ్డులోని బ్రహ్మగుండం క్షేత్రంలో ఈనెల 20న ఉదయం 9గంటల ప్రాంతంలో పెళ్లికి ముహూర్తం కుదిరింది. తమ తమ ఇళ్ల వద్ద పెళ్లి ముందు కార్యక్రమాలు పూర్తి చేసుకుని వధూవరులు, కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం రాత్రి బ్రహ్మగుండం చేరుకున్నారు. బుధవారం ఉదయం పెళ్లి తతంగం ప్రారంభమైంది. వధూవరుల బంధువులు రామళ్లకోట, వెల్దుర్తి, కర్నూలు మండలాల నుంచి విచ్చేశారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో పలువురు బంధువులు పెట్టుబడులు చదివించేసి కూడా వెళ్లిపోయారు. పెళ్లి పీటల మీద కార్యక్రమం జరుగుతున్న సందర్భంలో పెళ్లి కుమార్తె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు పెళ్లి కుమారుడు తనతో సహజీవనం చేస్తున్నాడంటూ విశాఖపట్నం నుంచి మాట్లాడుతున్నానంటూ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వివాహిత ఫోన్ ద్వారా సంప్రదించింది. తనను పెళ్లి కూడా చేసుకున్నాడు, పిల్లాడు ఉన్నాడంటూ ఫొటోలు షేర్ చేసింది. దీంతో పెళ్లి కుమారుడి అసలు బాగోతం తెలుసుకున్న వధువు కుటుంబ సభ్యులు పీటల వరకు వచ్చిన పెళ్లిని ఆపేశారు. వరుడిపై, అతని కుటుంబ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గొడవకు దిగారు. దీంతో వరుడి తరఫు గ్రామ పెద్దలు, బంధువులు కలుగజేసుకుని పంచాయతీ నిర్వహించి రూ.లక్ష కట్టించేలా, క్షమాపణలు చెప్పి పంపించారు. వరుడు విశాఖపట్నం నేవీ పోర్టు ప్రాంతంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే సోషల్ మీడియా ద్వారా పరిచయమై కుమార్తె ఉన్న ఓ వివాహితతో సహజీవనం చేస్తున్నాడు. పెళ్లి వాగ్దానాలతో గడుపుతూ ఇక్కడ పెళ్లికి సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఈ విషయం మంగళవారమే తెలుసుకున్న వివాహిత వెల్దుర్తి పోలీసులకు 100 కాల్ ద్వారా సంప్రదించి విషయం చేరవేసింది. కేసు ద్వారా లేక స్వయంగానైనా లేక పెళ్లి అయినట్లు తగు సాక్ష్యాలతో విచారణ కోరాల్సిందిగా పోలీసులు తెలపడంతో వివాహిత యువతి స్వయంగా వధువు కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా సంప్రదించి తనతో వరుడు గడిపిన ఫొటోలు షేర్ చేసి పెళ్లి ఆపినట్లు తెలుస్తోంది. తాను తన అక్కతో విశాఖపట్టణం నుంచి రామళ్లకోటకు బయలుదేరుతున్నట్లు వరుడి కుటుంబ సభ్యులకు తెలిపినట్లు సమాచారం. వరుడు తన స్వగ్రామంలో సైతం పలువురిని నమ్మించి తను పోర్టు ప్రాంతం నుంచి చవకగా బంగారు ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసినట్లు చర్చ జరుగుతోంది.

రిటైర్డ్ ప్రొఫెసర్లకు మళ్లీ అవకాశం

- కాంట్రాక్టు పద్ధతిలో నియామకానికి నోటిఫికేషన్
- స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఖాళీల భర్తీకి చర్యలు

కర్నూలు(హాస్పిటల్): రోగులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇటీవల రిటైర్డ్ అయిన ప్రొఫెసర్లను తిరిగి కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లో తీసుకునేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సైతం ఇటీవల విడుదల చేసింది. దరఖాస్తు చేసుకుని ఎన్నికైన వారికి సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో అయితే ప్రొఫెసర్‌కు రూ.2.5లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.2లక్షలు, స్పెషాలిటీ విభాగాల్లో అయితే ప్రొఫెసర్‌కు రూ.2లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1.50లక్షలు వేతనం చెల్లించనున్నారు. ఒక సంవత్సరం కాంట్రాక్టు పద్ధతిలో వీరిని నియమించనున్నారు. అవసరమైతే కాంట్రాక్టు ముగిసిన తర్వాత మరికొన్ని సంవత్సరాలు వీరి సేవలను పొడిగించుకునే అవకాశం కల్పిస్తున్నారు. కర్నూలు వైద్య కళాశాలలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరోసర్జరీ, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలలో ఒక్కో పోస్టు, ఆబ్‌స్టెట్రిక్ గైనకాలజీలో రెండు, డీవీఎల్‌లో ఒక పోస్టు ఖాళీగా చూపించారు. అలాగే అసోసియేట్ ప్రొఫెసర్లకు గాను అనాటమిలో మూడు, ఆబ్‌స్ట్రిక్ అండ్ గైనకాలజీలో రెండు, రేడియో డయాగ్నోస్టిక్, ఫోరెన్సిక్ మెడిసిన్, కార్డియాలజీ, సీటీవీఎస్, న్యూరాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీలో ఒక్కో పోస్టును చూపించారు. అర్హులైన, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోపు కర్నూలు మెడికల్ కాలేజీలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

అమ్మ ఒడిలో క్షేమంగా..

- పీహెచ్‌సీలో సురక్షితంగా కాన్పు
- ఆరోగ్యంగా తల్లీబిడ్డ



తల్లిచెంతకు కొడుకును చేరుస్తున్న వైద్యాధికారి

దొర్నిపాడు: హఠాత్తుగా పురిటి నొప్పులు వచ్చి బాధపడుతున్న ఓ గర్భిణికి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సుఖప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. దొర్నిపాడు మండలం బుర్రారెడ్డిపల్లె గ్రామానికి చెందిన రషీద నిండు గర్భిణి. ఈమెకు బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా పురిటి నొప్పులు రావడంతో స్థానిక ఆశావర్కర్ వెనువెంటనే 108లో దొర్నిపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. అహోబిలం బ్రహ్మోత్సవాల విధులకు వెళ్లిన డాక్టర్ నాగేంద్ర అప్పుడే ఆసుపత్రికి చేరుకుని స్టాఫ్ నర్సు దానమ్మ సహకారంతో వైద్య పరీక్షలు చేసి సహజ కాన్పు చేశారు. 3.5 కిలోలతో జన్మించిన మగబిడ్డను సురక్షితంగా తల్లి ఒడిలో చేర్చారు. సుఖప్రసవం కావడంతో కుటుంబసభ్యుల, బంధువులు ఊపిరిపీల్చుకున్నారు. ఇంటి వద్ద కాన్పులు క్షేమం కాదని వైద్యశాలలో సురక్షితమని ఈ సందర్భంగా డాక్టర్ పేర్కొన్నారు..

డోన్‌కు చేరిన మోడల్ ఈవీఎంలు

డోన్ టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన మోడల్ ఈవీఎంలు బుధవారం డోన్‌కు చేరుకున్నాయి. వీటిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డోన్ ఆర్డీఓ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి అఖిల పక్ష రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో వాటిని అన్‌లోడింగ్ చేశారు. అనంతరం ఆర్డీఓ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ అధికారులకు, సిబ్బందికి మోడల్ ఈవీఎంలను ఉపయోగిస్తూ ఓటింగ్ ప్రక్రియపై శిక్షణ ఇస్తామన్నారు. ఈవీఎం మిషన్‌తో పాటు ఇతర పరికరాలను రాజకీయపార్టీ నాయకులకు రికార్డుల ప్రకారం లెక్కించి చూపించారు. అనంతరం వాటిని సబ్ ట్రెజరీ కార్యాలయంలోని స్టోర్ రూంలో భద్రపరిచారు.



మోడల్ ఈవీఎంలను పరిశీలిస్తున్న దృశ్యం

అనుమతి పొందిన విత్తనాలనే ప్రాసెసింగ్ చేయాలి

నంద్యాల(అర్బన్): విత్తన కంపెనీలు అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే ప్రాసెసింగ్ చేయాలని, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం శ్రావణ లక్ష్మి సీడ్స్, వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్, భవ్యసీడ్స్, భారతి సీడ్స్, నాగవెంకటేశ్వర సీడ్స్ విత్తన శుద్ధి కేంద్రాల్లో కమిషనరేట్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ప్రేమ్‌శేఖర్, వ్యవసాయాధికారి సురేష్‌న్, ఏడీఏ రాజశేఖర్, ఏఓ ప్రసాదరావుతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించి హెచ్‌టీ కాటన్ స్ట్రిప్ టెస్టు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధిచేసే ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



శ్రావణలక్ష్మి సీడ్స్‌లో హెచ్‌టీ కాటన్‌కు స్ట్రిప్ టెస్టు నిర్వహిస్తున్న అధికారులు

ఆయిల్ మిల్‌లో విజిలెన్స్ తనిఖీలు

- రూ. 5 లక్షల విలువ చేసే అయిల్, మిషనరీలు సీజ్

ఎమ్మిగనూరురూరల్: కలుగొట్ల గ్రామ సమీపంలోని అమరావతి అయిల్ మిల్‌లో బుధవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఆయిల్ తయారీ విధానం, ఆయిల్ డబ్బాల లేబుల్స్, నాణ్యతలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రమేష్ అనే వ్యక్తి అమరావతి ఆయిల్ మిల్‌ను నిర్వహిస్తున్నారని, తయారీలో నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని ఫిర్యాదు రావటంతో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో రూ. 2 లక్షల విలువ చేసే ఆయిల్ డబ్బాలు, రూ.3 లక్షల విలువ చేసే ఆయిల్ తయారీ మిషనరీలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఫుడ్ సెఫ్టీ అధికారులు ఆయిల్‌ను పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



ఆయిల్ మిల్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- టీడీపీ నాయకుడి హస్తం
- విచారణ జరుపుతున్న పోలీసులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల నుంచి గుంజలపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో మొద్దులచేలుగా పిలువబడే పొలాల్లో మూడు రోజుల క్రితం గుప్త నిధుల కోసం తవ్వకాలు నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు.. పట్టణంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ ద్వితీయశ్రేణి నాయకుడు మరో వ్యక్తితో కలిసి ఎవరికి అనుమానం రాకుండా వేరే ప్రాంతం నుంచి ఇటాచ్ ప్రొక్లెయిన్ తెప్పించాడు. ఇద్దరు అర్చకులను ఏర్పాటు చేసుకుని తవ్వకాలు జరిపే ప్రాంతంలో నిమ్మకాయలు, కుంకుమ, తదితర పూజా సామగ్రితో మాంత్రిక పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో రెండు రోజులపాటు తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. అదే రస్తాలో పొలాలకు వెళ్లే రైతులు తవ్వకాలు జరిపిన ప్రదేశం అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం. తవ్వకాల్లో ఏవైనా బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు దొరికాయా, తవ్వకాలకు ఇంకా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్నకోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ట్రాన్స్ జెండర్లకు జాబ్ కార్డులు

నంద్యాల(సెంట్రల్): సమాజంలో వివక్షకు గురవుతున్న ట్రాన్స్ జెండర్లకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటి వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సాధారణ ప్రజలు, దివ్యాంగులకు మాత్రమే పని కల్పించేవారు. తాజాగా ట్రాన్స్ జెండర్లకు కూడా ఉపాధి పనుల కల్పనకు జాబ్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పని కావాలని కోరే ప్రతి ట్రాన్స్‌జెండరును ఓ కుటుంబంగా గుర్తించి కార్డు ఇస్తామని, ఏదైనా గ్రామపంచాయతీలో ఐదుగురి కంటే ఎక్కువ మంది ఉంటే వారిని శ్రమశక్తి సంఘాలుగా గుర్తించి పని కల్పిస్తామని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

డోన్ రూరల్ : పట్టణం సమీపంలోని స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల వద్ద కర్ణాటక మద్యంను సెబ్ పోలీసులు పట్టుకున్నారు. కర్నూలు నుంచి స్కార్పియో వాహనంలో తీసుకొస్తుండగా తనిఖీ చేశారు. అందులో ఉన్న 32 బాక్స్‌ల మద్యాన్ని గుర్తించి సీజ్ చేసినట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. డోన్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఈశ్వర్‌గౌడ్ కర్ణాటకలోని రాయచూర్ నుంచి మద్యం తెచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు. సమావేశంలో ఏఎస్‌ఐ సోమశేఖర్‌రావు, కానిస్టేబుల్ లక్ష్మీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కల్లూరు: కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రమోహన్‌రెడ్డి(54) మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు.. కర్నూలులో నివాసం ఉంటున్న చంద్రమోహన్‌రెడ్డి కె.నాగలాపురం వెళ్లి సుంకులమ్మను దర్శించుకుని, గుడిపాడులో బంధువుల ఇంటి వెళ్లారు. తిరిగి మంగళవారం రాత్రి కర్నూలుకు వస్తుండగా కె.మార్కాపురం క్రాస్ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు, కర్నూలు నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో చంద్రమోహన్‌రెడ్డి అక్కడికక్కడే మరణించగా గాయాలైన వారిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

శ్రీశైలం/శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ముఖద్వారం వద్ద బుధవారం పెను ప్రమాదం తప్పింది. మార్కాపురం డివిజన్ కొనకనమిట్ల మండలానికి చెందిన భక్తులు శ్రీశైల మల్లన్న దర్శనార్థమై ఐచర్ వ్యాన్ (ఏపీ27 ఏవై 4718)లో వస్తుండగా ముఖద్వారం సమీపంలో బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొట్టి వాహనం నిలిచిపోయేలా చేశారు. అందులో 40 మంది యాత్రికులు ఉన్నారు. అయితే, ఈ ఘటనలో డ్రైవర్ కాలు ఇరుక్కుపోయి ఫ్రాక్చర్ అవటంతో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో శ్రీశైలం ప్రాజెక్టు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



సైడ్‌వాల్‌ను ఢీకొని ఆగిన ఐచర్ వాహనం

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆదోనిసెంట్రల్: రైలు నుంచి కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ కె.గోపాల్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆస్పరి-మొలగవల్లి రైల్వే స్టేషన్ల మధ్య మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతదేహం కుళ్లిపోయి పూర్తిగా గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉందన్నారు. మూడు రోజుల క్రితం రైలు నుంచి కిందపడి మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ గోపాల్, పోలీసు సిబ్బంది